నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 12-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 262 | పేజీలు: 4 | వెల: రూ.1/-

హైదరాబాద్‌లో సీజేఐ ఎన్వీ రమణకు ఘనస్వాగతం

హైదరాబాద్ , జూన్ 11:రాజ్‌భవన్‌లో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వాగతం పలికారు. అనంతరం ఎన్వీ రమణ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌గా ఎన్వీ రమణ పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి హైదరాబాద్‌కు వచ్చారు. మూడు రోజులపాటు రాజ్‌భవన్ అతిథిగృహంలో బస చేయనున్నారు.

అంతకుముందు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎన్వీ రమణకు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ హిమా కోహ్లీ, మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, ఎమ్మెల్యేలు, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఇవాళ ఉదయం జస్టిస్ ఎన్వీ రమణ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రొఫెసర్ రాధామోహన్ మృతి పట్ల ప్రధాన మంత్రి మోడీ సంతాపం..

న్యూఢిల్లీ, జూన్ 11: ప్రముఖ అర్థశాస్త్రవేత్త, పర్యావరణవేత్త ప్రొఫెసర్ రాధామోహన్ మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు.“ప్రొఫెసర్ రాధామోహన్ గారు వ్యవసాయం పట్ల, ప్రత్యేకించి దీర్ఘకా? లికమైన వ్యవసాయం పట్ల, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల పట్ల ఎంతో మక్కువ కనబరచే వారు. ఆర్థిక వ్యవస్థ కు, పర్యావరణానికి సంబంధించిన విషయాల పైన ఆయన కు గల జ్ఞానానికి గాను ఆయన్ను పద్మశ్రీ అవార్డుతో గౌరవించడం జరిగింది. ఆయన కుటుంబానికి, ఆయన్ని అభిమానించే వారికి ఇదే నా ప్రగాఢ సానుభూతి. ఓమ్ శాంతి.” అని ప్రధాన మంత్రి మోడీ ట్విట్టర్ లో పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల గుండె చప్పుడు టీఆర్ఎస్ : ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, జూన్ 11:: తెలంగాణ ప్రజల గుండె చప్పుడు టీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. నిజామాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, టీఆర్ఎస్ నూతన కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా తెలియజేస్తూ, నిరంతం ప్రజల కోసం పనిచేస్తున్నామని ఎమ్మెల్సీ తెలిపారు.

ప్రజల ఆశీస్సులతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీఆర్ఎస్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలోని కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. కార్యాలయాల్లో ఉండే సిబ్బంది, ఇన్సూరెన్స్ లాంటి అనేక అంశాల్లో కార్యకర్తలకు సహాయసహకారాలు అందిస్తారని కవిత పేర్కొన్నారు. అంతేకాదు దేశంలోని బలమైన ప్రాంతీయ పార్టీల్లో ఒకటిగా టీఆర్ఎస్ నిలిచిందన్నారు.క్యాంపు కార్యాలయంలో అనేకమంది కార్యకర్తలు, ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించిన ఎమ్మెల్సీ కవిత వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నిజామాబాద్ రూరల్, బోర్గాం పి.గ్రామంలో ఎమ్మెల్యే జాజిరెడ్డి గోవర్ధన్ తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు ఉమారాణి, సాయరాం, జర్నలిస్టు బాలులను ఎమ్మెల్సీ పరామర్శించారు.

అన్నదానం అభినందనీయం..

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత భోజన వితరణ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఎమ్మెల్యే గణేష్ గుప్తా చేపట్టిన ఉచిత అన్నదానం ఎంతోమందికి ఉపయోగపడిందన్నారు. మరికొద్ది రోజులు కరోనా పట్ల అప్రమత్తత అవసరమన్నారు. అనంతరం ఫులాంగ్ చౌరస్తా లోని ఫులాంగ్ పార్క్ ని సందర్శించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, మేయర్ నీతూ కిరణ్, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం : మంత్రి తలసాని

హైదరాబాద్ , జూన్ 11: జీహెచ్ఎంసీ పరిధిలో వర్షాకాల కార్యాచరణ ప్రణాళికపై మంత్రులు మహముద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల ప్రభుత్వం దృష్టి సారించింది. మేయర్, డిప్యూటీ మేయర్ పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఫ్లై ఓవర్లు, స్టీల్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు నిర్మించామని తెలిపారు.

నగర అభివృద్ధికి మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. నాలాలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను త్వరలోనే తొలగిస్తామన్నారు. నాలాలపై ఇండ్లు నిర్మించుకున్నవారికి డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తామన్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి వారిని వంపిస్తామన్నారు. నగరంలో 1,368 కిలోమీటర్ల మేర నాలాల అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో త్వరలోనే నాలాలపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని చెప్పారు. ఓపెన్ నాలాల్లోని పూడికను మిషనరీ సహాయంతో తీస్తామని పేర్కొన్నారు. నాలాలు, చెరువులు ఆక్రమణలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

కుల్కచర్లలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

వికారాబాద్, జూన్ 11:జిల్లాలో పర్యటనలో భాగంగా విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పలు అభివృద్ధి పనులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తూ కుల్కచెర్ల మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

కుల్కచెర్ల మండల కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న సహకార పరపతి సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిర్మలాపూర్ గ్రామంలో కోటి 55 లక్షలతో నిర్మించనున్న గోదాం నిర్మాణ పనులకు రూ.80 లక్షలతో నిర్మిస్తున్న రైస్ మిల్ పనులకు శంకుస్థాపన చేశారు.

సీఎం కేసీఆర్ సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన : మంత్రి సబిత

వికారాబాద్, జూన్ 11:రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతున్నదని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన చౌడా పూర్ మండల కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..చౌడపూర్ ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశలో స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కృషి అభినందనీయమన్నారు.

ప్రజల ఆకాంక్షల కు అనుగుణంగా రాష్ట్రంలో జోన్‌లు,జిల్లాలు, రెవెన్యూ డివిజన్‌లు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో కొత్తగా 23 జిల్లాలు ఏర్పాటు కాగా ప్రజలకు పాలన మరింత దగ్గర అయిందని పేర్కొన్నారు. నూతనంగా 32 రెవిన్యూ డివిజన్లు, 134 మండలాలు ఏర్పడ్డాయి.

ఇటీవలి కాలంలో చివరగా పరిగి నియోజకవర్గంలోని ప్రజల అభిప్రాయం మేరకు మహమ్మదాబాద్, చౌడాపూర్ మండలాలు ఏర్పడ్డాయని తెలిపారు. 26,707 మంది జనాభా తో 14 రెవెన్యూ గ్రామలతో,మొత్తం 24 గ్రామ పంచాయతీ లతో ఏర్పడిన చౌడాపూర్ మండలంతో స్థానికుల కల నెరవేరిందన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పటయ్యాక ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్తగా మరో 76 మున్సిపాలిటీలు ఏర్పాటు చేశారన్నారు. వికారాబాద్ జిల్లాలో 209 నూతన గ్రామ పంచాయతీ లను ఏర్పాటు చేశామని వివరాలను వెల్లడించారు. జిల్లా ప్రజల ప్రజల కోరిక మేరకు వికారాబాద్‌ను చార్మినార్ జోన్‌లో కలిపామని గుర్తు చేశారు. త్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమీకృత కలెక్టరేట్ భవనాలను నిర్మించాలని నిర్ణయించింది.

కలెక్టరేట్ల నిర్మాణం కోసం1700 కోట్లు బడ్జెట్ లో కేటాయించామని మంత్రి తెలిపారు.

ల్లా కలెక్టర్ కార్యాలయం నిర్మాణం దాదాపు పూర్తి కావొస్తుందన్నారు. పాఠశాల అదనపు గదుల కృషి చేస్తానన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ద్వారా ఈ ప్రాంతం శశ్యశామలం అవుతుందన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పౌసమి బసు, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి ,అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య పాల్గొన్నారు.

పరమ్ బీర్ సింగ్ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూన్ 11: ముంబై మాజీ పోలీసు కమిషనర్ పరమ్ బీర్ సింగ్ అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. తనపై ఉన్న విచారణలను వ్యక్తిగత ఏజెన్సీకి అప్పగించాలని ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో మహారాష్ట్ర మాజీ హోంశాఖ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్‌పై పరమ్ బీర్ సింగ్ ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో పరమ్ బీర్‌ను సర్వీసు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విచారణల నుంచి మినహాయింపు ఇస్తూ తన కేసులను సీబీఐ లాంటి ఇండిపెండెంట్ ఏజెన్సీకి అప్పగించాలని పరమ్ బీర్ సుప్రీంను కోరారు. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ.. మహారాష్ట్రలో 30 ఏళ్లు పనిచేశారని, ఆ రాష్ట్ర పోలీసులపై నమ్మకంలేదని మీరిప్పుడు అంటున్నారని, ఇది పాకింగ్‌గా ఉందని న్యాయమూర్తి హేమంత్ గుప్తా తెలిపారు.

ఈ కేసులో పరమ్ బీర్ తరపున మహేశ్ జెఠ్మలానీ వాదించారు. సుప్రీం ఇలాంటి పిటిషన్లను ప్రోత్సహించదు అని, కావాలంటే మరో చోటుకు వెళ్లవచ్చు అంటూ సుప్రీం ధర్మాసనం పేర్కొన్నది. దీంతో జెఠ్మలానీ ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. తీర్పు సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. అద్దాలమేడల్లో ఉన్న వాళ్లు ఇతరులపై రాళ్లు విసరకూడదని అన్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్ తప్పుకోవడంతో ఈ కేసును జస్టిస్ గుప్తా బెంచ్‌కు అప్పగించారు.

మమతకు సుప్రీంకోర్టు మొట్టికాయ

న్యూఢిల్లీ, జూన్ 11: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సుప్రీం కోర్టు మొట్టికాయ వేసింది. ఆ రాష్ట్రంలో 'వన్ నేషన్- వన్ రేషన్' పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఆదేశించింది. ఎలాంటి సాకులూ చెప్పకుండా వెంటనే ఈ పథకాన్ని వర్తింపజేయాలని సుప్రీం కోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇది వలస కార్మికులను దృష్టిలో పెట్టుకొని తెచ్చిన పథకమని. మీ సమస్యలను ఉదహరిం చకుండా పథకాన్ని తక్షణం అమలు చేయాలని మమత ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

కాగా, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఢిల్లీలో తప్ప దేశవ్యాప్తంగా ఒకే దేశం.. ఒకే రేషన్ పథకం అమలవుతున్నది. అయితే రాజకీయ కారణాలతో సీఎం మమత బెంగాల్‌లో, సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో ఈ పథకాన్ని అమలు చేయడం లేదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు.

మోదీని కలిసిన యోగి.. గంట పాటు భేటీ

న్యూఢిల్లీ, జూన్ 11: ఉత్తరప్రదేశ్‌లో నెలకొన్న గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం ప్రధాని మోదీని కలిశారు సీఎం యోగి ఆదిత్యనాథ్. యూపీలో యోగిపై, కరోనాను ఆయన ప్రభుత్వం నిర్వహించిన తీరుపై సొంత పార్టీ నేతలే మండిపడుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. గంటకుపైగా మోదీతో యోగి భేటీ అయ్యారు. బిజీ షెడ్యూల్‌లో మోదీ తనకు సమయం కేటాయించినందుకు కృతజ్ఞతలు చెబుతూ యోగి ట్వీట్ చేశారు. అందులో మోదీని కలిసిన సందర్భంలోని ఫొటోను పోస్ట్ చేశారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలవడానికి యోగి ఆయన ఇంటికి వెళ్లారు.

గురువారం హోంమంత్రి అమిత్ షాతో యోగి గంటన్నర పాటు సమావేశమైన విషయం తెలిసిందే. ఎన్నికలకు మరో ఏడాది సమయం కూడా లేకపోవడంతో పార్టీలో ఏర్పడిన అంతర్గత విభేదాలను తగ్గించే పనిలో పార్టీ పెద్దలు ఉన్నారు. యోగిని మార్చే ఆలోచనలో పార్టీ లేకపోయినా.. కొన్ని కీలక మార్పులు తప్పకపోవచ్చని పార్టీ వర్గాలు వెల్లడించాయి. గత వారం బీజేపీ నేత బీకే సంతోష్ యూపీలో పర్యటించి అక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అభిప్రాయాలు సేకరించారు.

బీహార్‌లో డీఎస్పీగా ఎంపికైన తొలి ముస్లిం మహిళ

పట్నా, జూన్ 11: : బీహార్‌లో డీఎస్పీగా ఎంపికైన తొలి ముస్లిం మహిళగా రజియా సుల్తాన్ రికార్డుల్లో నిలిచారు. గోపాల్‌గంజ్ జిల్లాలోని హతువా గ్రామానికి చెందిన ఆమె 64వ బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎగ్జామ్స్‌లో (బీపీఎస్సీ) బీహార్ పోలీస్ ఫోర్స్‌లో డీఎస్పీగా ఎంపికయ్యారు. డీఎస్పీలుగా ఎంపికైన 40 మందిలో రజియ ఒకరు. ప్రస్తుతం ఆమె బీహార్ ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.

రజియాది గోపాల్‌గంజ్ అయినప్పటికీ విద్యాభ్యాసం మాత్రం జార్ఖండ్‌లోని బొకారోలో పూర్తయ్యింది. ఆమె తండ్రి మహమ్మద్ అస్లామ్ అన్సారీ బొకారో స్టీల్ ప్లాంట్‌లో స్టెనోగ్రాఫర్‌గా పనిచేశారు. దీంతో ఆమె బొకారోలో పాఠశాల విద్య పూర్తిచేశారు. జోధ్‌పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ కంప్లీట్‌చేశారు.

చిన్నప్పటి నుంచి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాయాలన్నది తన కల అని, డీఎస్పీగా ఎంపికవ్వడంతో తన కల సాకారమయ్యిందని రజియా చెప్పారు. 2017లో ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తాను బీపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాని తెలిపారు. పోలీస్ అధికారిగా పనిచేయనుండటం చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు సరైన న్యాయం అందని సందర్భాలు చాలా ఉన్నాయి, అందులో ముఖ్యంగా మహిళలు ఉన్నారు. మహిళలు తమకు జరిగే అన్యాయాలపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనకడుగువేస్తున్నారు. ఇలాంటి కేసులు నమోదయ్యేలా తనవంతుగా ప్రయత్నిస్తానని చెప్పారు.

బీఎడ్ కోర్సు ప్రవేశ నిబంధనలు సవరణ

హైదరాబాద్ , జూన్ 11:బీఎడ్ కోర్సు ప్రవేశ నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం సవరిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బీఎడ్ అడ్మిషన్స్ పొందాలనుకునే విద్యార్థులు అర్హత కోర్సుల్లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 40 శాతం కనీస మార్కులుగా నిర్దేశించింది. బీఎడ్ ఫిజికల్ సైన్స్ మెథడాలజీలో చేరాలనుకునే వారు డిగ్రీలో ఫిజిక్స్ లేదా కెమిస్ట్రీ ఏదేని ఓ సబ్జెక్టు చదివి ఉండాలి. గతంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ రెండు చదివి ఉంటేనే అర్హులుగా పరిగణించేవారు. బయాలజీ మెథడాలజీలో చేరాలంటే బొటనీ లేదా జువాలజీ సబ్జెక్టు ఉంటే అర్హులు. గతంలో ఈ రెండు సబ్జెక్టులు చదివిన వారు మాత్రమే అర్హులు.

చరిత్రలో నేటినిజం

కం॥ 'వెలగా' వంశమ్మునకే
వెలుపై వెలుగొంది నట్టి 'వేంకట నామన్'
తెలుగుల మదిలో నల-' త్రం
భాలయ జ్యోతిన్ గొలుతుని జనరెడి ప్రేమన్॥

(జూన్ 12 గ్రంథాలయోద్యమనేత వెలగా వెంకటప్పయ్య జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210

విశాలాక్షి
సాహిత్య మాస పత్రిక
శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి
స్మారక కథల పోటీ

విశాలాక్షి సాహిత్యమాస పత్రిక సంక్రాంతి కథల పోటీ నిర్వహించిన విజయానందంలో ఇప్పుడు శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారక కథల పోటీతో మరోసారి కథా రచయిత (త్రు)లకు చేరువవుతుంది. సంక్రాంతి కథల ప్రత్యేక సంపుటి లానే మరో కథల సంపుటిని ప్రత్యేకంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో ఉన్నాము. మీరంతా బహుమతులతో, మంచి తెలుగు కథలతో ప్రత్యేక సంపుటిని తెలుగు కథా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిపేలా భాగస్వాములయ్యేందుకు కొత్త కలంతో, సిరా బలంతో ముందుకు రావాలని మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాము.

బహుమతుల వివరాలు

వేసవి కథల సంపుటి కోసం	15 కథలు
15 కథలు ఎంపిక జరుగుతుంది.	ఒక్కో కథకు రూ. 3000/-
ఒక్కో కథకు రూ. 3000/-	సమాన బహుమతి
సమాన బహుమతి ఉంటుంది.	మొత్తం రూ. 45,000/-

ఎంపికైన మరికొన్ని కథలు - విశాలాక్షి మాసపత్రికలో సాధారణ ప్రచురణ జరుగుతుంది

- స్వచ్ఛమైన తెలుగు కథ. కొత్త కథ అయి ఉండాలి
- తిరిగొచ్చిన కథలు, జెరాక్స్ ప్రతులు వద్దు
- ఏదైనా సామాజిక అంశం.
- A4లో 5 పేజీలు మించకుండా యూనికోడ్‌లో మెయిల్‌కు పంపాలి.
- కథ మీద రచయిత పేరు లేకుండా ప్రత్యేకంగా హామీ పత్రంలో రాయాలి.
- ఎంపిక కాని కథలు తిరిగి పంపరనే విషయాలు ప్రత్యేకంగా చెప్పటం లేదు.

కథలు పంపవలసిన మెయిల్ :
e-mail : visalakshi.poteelu@gmail.com

Address :
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785

గడువు :
15-7-2021

ఒంటరిగా ఉంటున్న వృద్ధుల రక్షణ,భద్రతకోసం "సురక్షాయోజన" పేరిట

వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు

కరీంనగర్ జూన్ 11(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కమిషనరేట్వ్యాప్తంగా ఒంటరిగా ఉండే వృద్ధులకు భద్రతపై భరోసా, రక్షణ కల్పించడం కోసం పోలీస్శాఖ "సురక్షాయోజన" పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఒంటరిగా ఉండే వృద్ధులపై జరుగుతున్న వివిధ రకాల దాడులు, ఒంటరిగా ఉండే వృద్ధులను లక్ష్యంగా పెట్టుకుని ఈ మధ్యకాలంలో కమిషనరేట్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం అమలుతో ఒంటరిగా ఉండే 60 సంవత్సరాల పైబడిన వృద్ధులు అభద్రతాభావానికి లోనుకావాల్సిన అవసరంలేకుండా పకడ్బందీగా అమలు చేయబోతున్నారు. ఈ నూతన కార్యక్రమం అమలుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

కరీంనగర్ కమిషనరేట్వ్యాప్తంగా ఒంటరిగా ఉంటున్న వృద్ధులు తమపేర్లు, చిరునామాలను పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని కంట్రోల్రూం ఫోన్నెంబర్ 9440900971 కు ఫోన్చేసి నమోదు చేసుకోవాలి. నమోదైన పేర్లు, చిరునామాలను సంబంధిత పోలీస్స్టేషన్లకు పంపించడం జరుగుతుంది. సదరు పోలీస్స్టేషన్లకు చెందిన అధికారులు ఒంటరిగా ఉంటున్న వృద్ధుల వద్దకు వెళ్ళి వాళ్ళను పలుకరించడంతోపాటు వారికి తగు జాగ్రత్తలపై అవగాహన కల్పించడం, రక్షణ,భద్రతలపై తీసుకోబడే చర్యలను సమీక్షించడం జరుగుతుంది.

కమిషనరేట్లోని అన్నివర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పిస్తూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తూ పోలీస్శాఖ ముందుకుసాగుతున్నది. అన్నివర్గాలకు చెందిన ప్రజలు 60సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు పైన పేర్కొన్న ఫోన్నెంబర్కు సమాచారం అందించి పోలీస్శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ఈ కార్యక్రమాన్ని సఫలీకృతం చేయాలని కోరుతున్నాము.

భారీగా పెరిగిన సిమెంట్, స్టీల్ ధరలు

హైదరాబాద్ , జూన్ 11:లాక్ డౌన్ ఎఫెక్ట్ నిర్మాణ రంగంపై పడింది. సిమెంట్, స్టీల్ ఉత్పత్తి తగ్గి కొరత ఏర్పడిందన్న సాకుతో ఉత్పత్తి దారులు ధలను అమాంతం పెంచేశారు. దీంతో ధరలు ఒక్కసారిగా కొండెక్కి కూర్చోవడంతో నిర్మాణరంగం కుదేలవుతోంది. ఇతర సామాగ్రి ధరలు చుక్కలనంటుతుండడం, సిమెంట్, స్టీల్ ధరలు ఏడాదిలో 60 నుంచి 80 శాతం పెరగడం.. ఈ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

కొత్త నిర్మాణాల సంగతి పక్కన బెడితే? నిలిచిపోయిన నిర్మాణాలను కూడా పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. గత నాలుగైదేళ్లలో ఇంత పెద్ద మొత్తంలో ధరల పెరుగుదల ఎప్పుడూ లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఈ స్థితిలో రోజువారి విక్రయాలు నాలుగోవంతుకు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు నిర్మాణాలు 15 నుంచి 25 శాతమే జరుగుతున్నట్లు క్రెడాయ్ ప్రతినిధులు చెబుతున్నారు.

టోక్యో ఒలింపిక్స్‌కు మంత్రివర్గ ప్రతినిధుల బృందం పంపడం లేదు

హైదరాబాద్ , జూన్ 11:నిరంతరాయంగా సమీక్షించనుంది. అథ్లెట్ల పని తీరును గరిష్ఠపరచడానికి కోచ్‌లు, వైద్యులు, ఫిజియోథెరపిస్టులు వంటి అదనపు సహాయక సిబ్బందిని నియమించాలని మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఏదైనా ప్రోటోకాల్ అవసరం ఉంటేనే అథ్లెట్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది తప్ప వేరే వ్యక్తులను టోక్యోకు పంపే విషయం సమీక్షించబడుతుంది. ఈ ఏర్పాట్లలో భాగంగా టోక్యో ఒలింపిక్స్‌కు మంత్రిత్వ శాఖ ప్రతినిధులను పంపకూడదని నిర్ణయించారు. లాజిస్టిక్ మద్దతును అందించడానికి గాను టోక్యోలోని భారత రాయబార కార్యాలయంలో ఒక ప్రత్యేక ఒలింపిక్ మిషన్ సెల్ ఏర్పాటు చేయబడుతోంది. దీని ద్వారా సాధ్యమయ్యే అన్ని రకాల సహాయం సజావుగా అందించబడుతుంది.

4500 కోట్ల రూపాయల సౌర పీఎల్ఐ పథకానికి బిడ్లు ఆహ్వానించిన ఇరెడా

న్యూఢిల్లీ, జూన్ 11:'కేంద్ర నూతన, పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ' (ఎంఎన్ఆర్ఈ) ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్' (ఇరెడా), సౌర విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేయడానికి సౌర మాడ్యూళ్ల తయారీదారుల నుంచి బిడ్లను ఆహ్వానించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 4,500 కోట్ల రూపాయల ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద ఈ బిడ్లను పిలిచింది. ఈ పథకం అమలు సంస్థగా ఇరెడాను ఎంఎన్ఆర్ఈ నియమించింది. సోలార్ ఫోటో వోల్టాయిక్ (పీవీ) మాడ్యూళ్ల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు 4500 కోట్ల రూపాయల పథకానికి కేంద్ర మంత్రివర్గం గతంలోనే ఆమోదముద్ర వేసింది.

ఈ పథకానికి దరఖాస్తు చేయడానికి ఈ నెల 30 ఆఖరు తేదీ. అన్ని అర్హతలున్న బిడ్డర్లను జులై 30 కల్లా ఎంపిక చేస్తారు. గత నెల 25న, ఇరెడా తన వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియ అదే నెల 31 నుంచి ప్రారంభమైంది.

ఈ పథకం కింద కేటాయించిన మొత్తం ఉత్పత్తి సామర్థ్యం కోసం బ్రౌన్‌ఫీల్డ్ లేదా గ్రీన్‌ఫీల్డ్ సదుపాయాన్ని దరఖాస్తుదారులు సిద్ధం చేసుకుని ఉండాలి. బ్రౌన్, గ్రీన్‌ఫీల్డ్‌ను కలిపి చూపడానికి వీల్లేదు. ఉత్పత్తి సామర్థ్యం కోసం అవసమైన సామగ్రిని బిడ్ చివరి తేదీ కంటే ముందే దిగుమతి చేసుకుంటే, ఈ పథకం కింద అనర్హులుగా గుర్తిస్తారు. కనీసం వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేయాలి. అన్ని అర్హతలున్న సంస్థలకు ఏటా, ఐదేళ్లపాటు పీఎల్ఐ అందిస్తారు.

ప్రస్తుతం, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న సౌర బ్యాటరీలు, మాడ్యూళ్లపైనే సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రధానంగా ఆధారపడి ఉంది. దేశీయంగా వీటి ఉత్పత్తి అతి తక్కువగా ఉంది. విద్యుత్ రంగం వంటి వ్యూహాత్మక రంగం కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడడాన్ని 'అధిక సామర్థ్య సౌర పీవీ మాడ్యూళ్ల జాతీయ కార్యక్రమం' తగ్గిస్తుంది. 'ఆత్మనిర్భర్ భారత్‌ను' బలోపేతం చేస్తుంది.

హెచ్ ఐ వి మీద పోరులో మనందరిదీ ఒకటే మాట: డాక్టర్ హర్షవర్ధన్

న్యూఢిల్లీ, జూన్ 11:75వ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో వర్చువల్ పద్ధతిలో పాల్గొని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ప్రసంగించారు. హెచ్ ఐ వి/ఎయిడ్స్ మీద సంస్థ నిర్ణయాన్ని అమలు చేసే కమిటీ చేసిన 75/260 తీర్మానం మీద ఆయన ప్రసంగించారు

ఈరోజు ప్రతిష్ఠాత్మకమైన ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వేదికమీద మాట్లాడటం గౌరవప్రదంగా భావిస్తున్నాను. మా ప్రభుత్వం తరఫున మీ అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినవారిని అభినందిస్తున్నాను. ఎయిడ్స్ మీద ఏర్పాటైన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశం పాలుపంచుకోవటం ఆనందంగాను, ప్రతిష్ఠాత్మకంగాను ఉంది. హెచ్ ఐ వి మహమ్మారి అదుపులోనే ఉందని అనిపించినప్పటికీ ఇలాంటి మహమ్మారులు మళ్ళీ మళ్ళీ వచ్చే అవకాశం ఉంది గనుక అత్యంత అప్రమత్తంగా ఉంటూ సకాలంలో నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కోవిడ్ సంక్షోభ సమయంలో నిస్వార్థ సేవలందించినవారందరికీ ఈ సందర్భంగా అభినందిస్తున్నాను. ఇలాంటి విపత్కర సమయంలో సైతం హెచ్ ఐ వి బాధితులకు వైద్య సేవలు నిత్యం కొనసాగేలా కృషి చేయటం చాలా గొప్ప విషయం. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నాఈ కరోనా సమయంలో మరణించిన హెచ్ ఐ వి/ ఎయిడ్స్ బాధితులకు నివాళులర్పిస్తున్నాను.

సంక్షోభానికి స్పందించిన తీరులో భారతదేశం తన బలమైన రాజకీయ నాయకత్వాన్ని ప్రదర్శిమ్చింది. అసమానతలను పరిష్కరించగలిగింది. పౌరసమాజాన్ని, అభివృద్ధి భాగస్వాములను భాగస్వాములను చేయటం ద్వార కోవిడ్ ప్రభావం హెచ్ ఐ వి బాధితులమీద పడకుండా భారత్ చాలా వేగంగా, సానుకూలంగా స్పందించింది. భారత్ లో 2017 నాటి హెచ్ ఐవి, ఎయిడ్స్ నిరోధక, నియంత్రన చట్టం బాధితులను కాపాడటానికి, మానవహక్కుల రక్షణ కలిగించటానికి ఒక చట్టపరమైన చట్రాన్ని రూపొందించింది. భారతదేశందాదాపు 14 లక్షలమందికి యాంటీ రెట్రో వైరల్ చికిత్స అందిస్తోంది. ఆఫ్రికాలో ఎయిడ్స్ తో బాధపడే వారికి భారతదేసపు ఔషధాలు అందుతున్నాయి. సులభంగా చేరుకోలేని జనాభాకు, రిస్క్ ఉన్న జనాభాకు అందటానికి జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం విశేషంగా కృషి చేస్తోంది. హెచ్ ఐ వి బాధితులను క్రమంగా సురక్షితమైన యాంటీ రెట్రో వైరల్ మందుల వైపు నడిపిస్తున్నాం.

వైరల్ లోడ్ పరీక్షాకేంద్రాల సంఖ్య పెంచాం. తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా హెచ్ ఐ వి కౌన్సిలింగ్, పరీక్షలు, తొలిదశలోనే గుర్తించటం లాంటి సౌకర్యాలు పెంచాం. అందరి ఎదుగుదలకోసం కలసి పనిచేద్దామన్న భారత ప్రభుత్వ విధానానికి అనుగుణంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ పథకం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల సహకారం అందుకోవటానికి అవగాహనాఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ భయంకర వ్యాధితో బాధపడుతున్నవారిని 100% అందుకోవటానికి భారత్ కృషిచేస్తోంది.

పదేళ్లలో ఎయిడ్స్ ను సమూలంగా అంతం చేయాలన్న లక్ష్య సాధనకు ఇంకా కేవలం 115 నెలలే ఉండగా ముందుగా హెచ్ ఐ వి సంక్రమణను సున్నా స్థాయికి తీసుకురావాల్సిన అవసరం ఉందని గుర్తించాం. మా ముందు సుదీర్ఘ యాత్ర ఉంది. ఎదురయ్యే సవాళ్ళను ముందుగానే గుర్తించటం, లోపాలు భర్తీచేయటం, కార్యక్రమాన్ని మెరుగ్గా తీర్చిదిద్దటం, పరిజ్ఞానాన్ని ఇతరులకు పంచటం, మెరుగైన ఆచరణ విధానాలు అవలంబించటం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించటం తక్షణ కర్తవ్యం. ఈ పోరులో మనందరిదీ ఉమ్మడి లక్ష్యం.

కరోనా నుంచి కోలుకున్న వారికి ఒక్క డోసు టీకాతోనే అధికంగా యాంటీబాడీలు వృద్ధి: ఏఐజీ

న్యూఢిల్లీ, జూన్ 11:కరోనా నుంచి కోలుకున్న వారికి ఒక్క టీకా డోసు చాలని ఏఐజీ వైద్యుల పరిశోధనలో వెల్లడైంది. ఒక్క డోసుతోనే వారిలో యాంటీబాడీలు వృద్ధి చెందుతాయని డాక్టర్లు చెప్పారు. కరోనా నుంచి కోలుకున్న వారిలో ఏడాది పాటు రక్షణ ఉంటుంది కాబట్టి, ఆ తర్వాత బూస్టర్ డోసు ఇవ్వచ్చన్నారు. ఈ విషయాలతో కూడిన రిపోర్టును ఐసీఎంఆర్ కు పంపామని వెల్లడించారు. వైరస్ బారినపడిన నెల రోజుల తర్వాత ఒక డోసు పొందడం ద్వారా వీరిలో గణనీయంగా యాంటీబాడీలు వృద్ధి చెందినట్లుగా వైద్య నిపుణులు గుర్తించారు. ఏకంగా మూడింతలు అధికంగా ఉన్నట్లు తేల్చారు. అదే వైరస్ బారినపడని వ్యక్తుల్లో ఒక డోసు పొందిన తర్వాత యాంటీబాడీల వృద్ధి సాధారణంగా ఉంది.

ఈ అంశంపై హైదరాబాద్‌లోని 'ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ(ఏఐజీ)' వైద్య నిపుణులు డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి ఇతర డాక్టర్లు సంయుక్తంగా పరిశోధన నిర్వహించారు. పరిశోధనలో భాగంగా కరోనా బారిన పడిన వారికి, కరోనా బారిన పడని వారికి టీకాలు ఇచ్చారు. ఒక డోసు టీకా ఇచ్చిన వారిలో 4 వారాల తర్వాత యాంటీబాడీలు ఏ మేరకు వృద్ధి చెందాయో పరిశీలించారు. కొవిడ్ బారినపడి కోలుకున్న వారిలో అవిగణనీయంగా వృద్ధి చెందాయి. అదే ఒక డోసు తీసుకున్న సాధారణ వ్యక్తుల్లో అంతగా వృద్ధి చెందలేదు. ముఖ్యంగా సాధారణ వ్యక్తుల్లో కంటే కొవిడ్ బారినపడి కోలుకున్న వారిలో ఒక డోసు టీకాకే మూడింతలు అధికంగా వచ్చాయి. కొవిడ్ యాంటీబాడీలు వృద్ధి చెందాయా? లేదా అనేది తెలుసుకోవడానికి 'న్యూట్రలైజింగ్ యాంటీబాడీస్ ఎస్1 ఎస్2' అనే పరీక్ష చేస్తారు. ఫలితాల్లో యాంటీబాడీల వాల్యూ 150 దాటితే రక్షణగా ఉంటుందని అర్థం. కొవిడ్ సోకకుండా ఒక డోసు టీకా పొందిన వారిలో వాల్యూ సుమారు 150 వరకూ పెరిగింది. అదే వైరస్ సోకి తగ్గాక వ్యాక్సిన్ తీసుకుంటే 450 కంటే ఎక్కువగా ఉన్నట్లు నిపుణులు గుర్తించారు."సాధారణంగా ఒక డోసు టీకా తీసుకుంటే ఒకట్రెండు నెలల్లో యాంటీబాడీలు తగ్గిపోతాయి. కానీ కరోనా నుంచి కోలుకున్న వారిలో ఒక డోసు తీసుకుంటే ఎక్కువ కాలం యాంటీబాడీలు కొనసాగుతున్నాయి. వీరిలో 'టి సెల్' జ్ఞాపకశక్తి దాదాపు 12 నెలల పాటు రక్షణ కల్పిస్తుందని అంచనా. 'టి కణాల' జ్ఞాపకశక్తి అనేది ఎముక మజ్జ (బోన్ మ్యారో)లో ఉండిపోతుంది. మరోసారి ఎప్పుడైతే వైరస్ దాడి చేస్తుందో.. అప్పుడు ఈ 'టి సెల్స్' రక్షణగా ముందుకొస్తాయి. వైరస్‌కు వ్యతిరేకంగా అవసరమైన మేరకు పెద్ద సంఖ్యలో యాంటీబాడీలను వృద్ధి చేస్తాయి" అని నిపుణులు వెల్లడించారు.

"కొవిడ్ సోకిన ఎవరైనా నెల రోజుల తర్వాత టీకా తీసుకోవచ్చు. ఇటువంటి వారికి ఒక్క డోసుతోనే యాంటీబాడీలు బాగా వృద్ధి చెందుతాయి. రెండోది అవసరం లేదు. ఇలా మిగిలిన వాటిని ఇతరులకు ఉపయోగించొచ్చు. ప్రభుత్వానికి టీకాలపై ఖర్చు కూడా తగ్గుతుంది. ఇటువంటి వారికి ఏడాది పాటు రక్షణ ఉంటుందనే అంచనాల నేపథ్యంలో.. బూస్టర్ డోసును ఏడాది తర్వాత ఇవ్వొచ్చు. ఈ అధ్యయన అంశాలను భారతీయ వైద్య పరిశోధన మండలికి (ఐసీఎంఆర్‌కు) కూడా పంపించాం. కొవిడ్ వచ్చిన వారికి ఒక డోసు టీకా సరిపోతుందనే అంశంపై కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో విధానపరమైన నిర్ణయం తీసుకోవడానికి మా పరిశోధన ఉపయోగపడుతుంది" అని ఏఐజీ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి అన్నారు.

టీఆర్ఎస్ ఎంపీ నామా ఇంట్లో ఈడీ సోదాలు

ఖమ్మం, జూన్ 11: ఖమ్మం జిల్లాలకు చెందిన టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్‌రావుకు చెందిన కార్యాలయాలు, ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఈ రోజు దాడులు చేస్తున్నారు. మధుకాన్ గ్రూప్ సంస్థలతో పాటు మరో ఐదు ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరుగుతున్నాయి.

రుణాల పేరుతో బ్యాంకులను మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ అధికారులు సోదాలు చేస్తున్నారు. మధుకాన్ డైరెక్టర్ల ఇళ్లలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. రాంకీ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో తీసుకున్న రుణాలను దారి మళ్లించారనే అభియోగాలపై తనిఖీలు జరుగుతున్నాయి. ఆ సంస్థల బ్యాంకు ఖాతాలు, డాక్యుమెంట్లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివరాలను అధికారులు అడుగుతున్నారు.

రూ.1064 కోట్ల బ్యాంక్ ఫ్రాడ్ కేసులో ముమ్మర సోదాలు చేస్తున్నారు.

మధుకాన్ కంపెనీ పేరుతో పలు బ్యాంకు ల్లో భారీగా లోన్స్ తీసుకొని పలు విదేశీ కంపెనీలకు డబ్బులు మళ్లించారని అభియోగాలు వినిపిస్తున్నారు. 2011లో రాంచీ ? జనీషెడ్పూర్ హై వే కాంట్రాక్ట్ ను మధుకాన్ కంపెనీకి అప్పగించారు. ౮

పాజెక్ట్ కోసం మధుకాన్ కంపెనీ రూ. 1100 కోట్లు లోన్ తీసుకుంది. 264 కోట్లు రూపాయలు నిధులు పక్క దారి పట్టించునట్టు మదుకన్ కంపెనీపై అభియోగం నమోదు అయ్యాయి.

నిధుల మళ్లింపుపై 2019లో సీబీఐ కేసు నమోదు చేసింది. మదుకాన్ డైరెక్టర్ లు శ్రీనివాస్ రావు, సీతయ్య, పృథ్వీ తేజ్ ల పేర్లను సీబీఐ ఎఫ్ఐఆర్ లో చేర్చింది.

రాంకీ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్ట్ పూర్తి చేయకపోవడంపై రాంచీ హై కోర్టులో పలు పిటిషన్ లు దాఖలు అయ్యాయి. ప్రాజెక్ట్ స్కాం పై విచారణ చేయాలని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ అధికారులకు ఝార్ఖండ్ హై కోర్టు ఆదేశించారు

. సీబీఐ విచారణలో మాధుకాన్ ప్రాజెక్ట్ నుండి నిధులు మధుకాన్న్న్నా, మధుకాన్ టోల్ హైవేలకు మళ్లించినట్లు ఎఫ్ఐఆర్ లో పేర్కొంది. 2012 లో మదుకాన్ ఆడిట్ సర్టిఫికెట్ లో సైతం తప్పులు చూపించిందని తెలిపింది.

6 ప్రాంతాలలో ఈడీ నామకు చెందిన కంపెనీల్లో సోదాలు చేస్తోంది. ఖమ్మంతోపాటు హైదరాబాద్ లోనూ సోదాలు కొనసాగుతున్నాయి.

పెరిగిన ఇంధన ధరలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

హైదరాబాద్ , జూన్ 11:రోజు రోజుకూ పెట్రోల్, డీజిల్ ధరలు అదుపులేకుండా పెరుగుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు, నగరాల్లో లీటరు పెట్రోల్ ధర వంద దాటింది. ఒకవైపు కరోనా తరుముతుంటే.. మరో వైపు ఇంధన ధరలు చుక్కలనంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలు చేపట్టింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. మహమ్మారి వేళ కూడా బీజేపీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

ఢిల్లీలో సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. యూపీఏ అధికారంలో ఉన్న సమయంలో .. పెట్రోల్, డీజిల్‌పై పన్ను కేవలం 9.20 మాత్రమే ఉండేదని, కానీ ఇప్పుడు అది రూ.32కు చేరినట్లు ఆయన తెలిపారు. పెట్రోల్, డీజిల్ పై పెరిగిన ఎక్సైజ్ సుంకాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంధన ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కేసీ వేణుగోపాల్ కోరారు. మరోవైపు ఏపీ, తెలంగాణలోనూ పలు ప్రాంతాల్లో ఇంధన ధరలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు.

బీజేపీలోకి ఈటల.. నేడు రాజీనామా

న్యూఢిల్లీ, జూన్ 11:మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఎమ్మెల్యే పదవి రాజీనామాకు ముహూర్తం ఖరారైంది. శనివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయనున్నారు. గన్‌పార్క్ దగ్గర రేపు అమరవీరుల స్థూపానికి ఈటల నివాళులు అర్పించనున్నారు. అనంతరం అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయానికి వెళ్లి రాజీనామా పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ నెల 14న బీజేపీలో ఈటల చేరనున్నారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో కాషాయ కండువా కప్పుకోనున్నారు. ఈటలతో పాటు ముఖ్యనేతలు ఏనుగు రవీందర్ రెడ్డి, తుల ఉమతో పాటు మరికొంతమంది నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకొనున్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయండి: జగన్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 11:ఢిల్లీలోని రైల్ భవనలో కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భేటీ అయ్యారు. రాష్ట్ర సివిల్ సప్లైకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని పీయూష్ గోయల్‌ను కోరారు. 2020-21 రబీ సీజన్‌కు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, సకాలంలో రైతులకు చెల్లింపులు అందేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రబీ ధాన్యం సేకరణ చురుగ్గా సాగుతుందని, బకాయిలు విడుదల అత్యంత అవసరమని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా బియ్యం సబ్సిడీ బకాయిలు చెల్లించాలని, కేంద్రం నుంచి రావాల్సిన రూ.3,229 కోట్ల బకాయిలు విడుదల చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

మరో రెండు నెలలపాటు ఉచితంగా బియ్యం పంపిణీని కేంద్రం పొడిగించినందుకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. 2015 డిసెంబర్ వరకు జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఏపీలో 1.29 కోట్ల రేషన్‌కార్డుదారులకు ప్రతినెల బియ్యం కేటాయిస్తున్నారని, 2015 డిసెంబర్ తర్వాత 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుని గ్రామీణ ప్రాంతాల్లో 60.96% కుటుంబాలకు, పట్టణాల్లో 41.14% కుటుంబాలకు మాత్రమే పరిమితం చేసి బియ్యం ఇచ్చేలా సూత్రాన్ని అమలు చేస్తున్నారని పీయూష్ గోయల్‌కు తెలిపారు. దీని వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం జగన్ తెలిపారు.

కర్ణాటకలో రూరల్‌లో 76.04శాతం, అర్బన్‌లో 49.36శాతం, గుజరాత్‌లో రూరల్‌లో 76.64శాతం, అర్బన్‌లో 48.25శాతం, మహారాష్ట్రలో రూరల్‌లో 76.32శాతం, అర్బన్‌లో 45.34శాతం, కుటుంబాల ప్రాతిపదికన వారికి బియ్యం కేటాయిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ కన్నా ఆయా రాష్ట్రాలు ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందాయని సీఎం వివరించారు. ప్రస్తుతం రేషన్ బియ్యాన్ని కేటాయిస్తున్న ప్రాతిపదిక కూడా, రాష్ట్ర విభజనకు ముందు నిర్ణయించినదని, తెలంగాణకు, ఏపీ మధ్య ఎలాంటి వ్యత్యాసం లేకుండా అదే ప్రాతిపదికన బియ్యాన్ని కేటాయిస్తున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

రేషన్‌కార్డులకు అర్హులైన వారిని గుర్తించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అంటూ గతంలో సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం నివేదించిందని, పారదర్శక పద్ధతిలో రాష్ట్రంలో ఇంటింటా సర్వే జరిపి 1.47 కోట్ల రేషన్‌కార్డు దారులు జాతీయ ఆహార భద్రత చట్టం కింద అమలు చేస్తున్న కార్యక్రమానికి అర్హులని తెలిపారు. ఈ వివరాలు అన్నింటినీ కూడా డిజిటలైజేషన్ కూడా చేశామని చెప్పారు. తర్వాత కూడా జాతీయ ఆహార భద్రతా చట్టం కింద హేతుబద్ధతలేని పరిమితి కారణంగా పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని, వీరందరి రేషన్‌భారం రాష్ట్ర ప్రభుత్వం మోస్తోందన్నారు. ఇది రాష్ట్రానికి చాలా భారమని, వెంటనే దీన్ని సరిదిద్దాలని సీఎం కోరారు. కోవిడ్ వల్ల రాష్ట్రంలో తలెత్తిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఏపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను కేంద్ర మంత్రికి సీఎం జగన్ వివరించారు.

పోలవరం ప్రాజెక్ట్ వద్ద కీలక ఘట్టం.. స్పిల్‌వే ద్వారా నీటి విడుదల

అమరావతి, జూన్ 11:ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం ప్రాజెక్టు వద్ద కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. స్పిల్ వే నుంచి అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రధాన ప్రవాహం నుంచి నీటిని స్పిల్ వేకు మళ్లించారు. ఈ సందర్భంగా వర్చువల్ గా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని పాల్గొన్నారు. మరోవైపు పోలవరం అప్రోచ్ చానల్ వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు, రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు, ప్రాజెక్టు నిర్మాణ సంస్థ మేఘా ఇంజినీరింగ్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టి నీటిని స్పిల్ వేకు విడుదల చేశారు.కాగా స్పిల్ వేకు విడుదలైన గోదావరి నీరు రివర్ స్లూయిస్ గేట్ల ద్వారా ధవళేశ్వరం బ్యారేజీకి చేరుతుంది. బ్యారేజి నుంచి గోదావరి డెల్టా కాలువల ద్వారా పంట పొలాలను సస్యశ్యామలం చేయనుంది. ఓవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఉండగానే, నీటిని దిగువకు పంపించగలగడం విశేషం అని చెప్పాలి. గోదావరి వరద నీటిని అడ్డుకునే ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తికావడంతో నీటిని స్పిల్ వేకు మళ్లించడానికి సాధ్యమైంది.

గుర్తింపు పొందిన డ్రైవర్ శిక్షణా సంస్థలకు నియమావళిని జారీ

హైదరాబాద్ , జూన్ 11:గుర్తింపు పొందిన డ్రైవర్ శిక్షణా సంస్థలకు కొన్ని తప్పనిసరి నియమావళిని రోడ్డు రవాణా ఉ హైవేల మంత్రిత్వ శాఖ (ఎంఒఆర్‌టిహెచ్) జారీ చేసింది. ఈ నియమ నిబంధనలు 01 జులై, 2021 నుంచి అమలులోకి వస్తాయి. అటువంటి కేంద్రాలలో నమో

సోనూసూద్ కోసం 700 కి.మీ. పాదయాత్ర

హైదరాబాద్ , జూన్ 11:గత ఏడాది లాక్?డౌన్ సమయంలో ఎంతో మంది వలస కార్మికులకు సాయం చేసి రియల్ హీరో అనిపించుకున్నాడు. ఇప్పటికీ అడిగిన వారికి లేదనకుండా సహాయం చేస్తున్న సోనూసూద్?ను దేవుడిగా కోలుస్తున్నారు చాలా మంది. ఎంతో మంది కరోనా బాధితులకు సాయం చేస్తూ? ప్రాణదాతగా నిలిచాడు. కేవలం ఆర్థిక సాయం మాత్రమే చేసి చేతులు దూలుపుకోకుండా.. ఆసుపత్రి చికిత్స, మందులు, బెడ్స్, ఆక్సిజన్ సిలిండర్స్ ఇలా ఏ చిన్న సాయం కోరినా చేస్తూ తన సేవగుణాన్ని చాటుకుంటున్నాడు. దీంతో దేశ వ్యాప్తంగా సోనూసూద్?ను ఆరాధించేవారు, అభిమానులు అధికంగా ఉన్నారు. తాజాగా సోనూసూద్ వీరాభిమానిగా మారిన తెలంగాణకు చెందిన యువకుడు వెంకటేశ్..ఎవరు చేయని సాహసం చేశాడు.

రియల్ హీరోను కలిసేందుకు వికారాబాద్ నుంచి ముంబైకి పాదయాత్ర చేపట్టాడు. పది రోజుల్లో దాదాపు 700 కి.మీ. నడిచి ఎట్టకేలకు అభిమాన నటుడిని కలుసుకున్నాడు. తన కోసం కాలినడకన వచ్చిన అభిమానిని చూసి సోనూసూద్ చలించిపోయాడు. అతడిని తన ఇంటికి పిలిచి.. కాసేపు అతడితో ముచ్చటించాడు. వెంకటేష్ తనకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాడని తెలిపాడు సోనూసూద్. కానీ దయచేసి ఎవరూ ఇలాంటి సాహసాలు చేయొద్దని కోరాడు.

కల్యాణలక్ష్మితో ఆర్థిక భరోసా

హైదరాబాద్ , జూన్ 11: పేదింటి ఆడపిల్లల పెండ్లిల కు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ పేదింటి ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. గురువారం రాంనగర్ ఎస్ఆర్టీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 93 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి ద్వారా మంజూరైన చెక్కులను స్థానిక కార్పొరేటర్లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఏటా నియోజకవర్గంలో వందలాది మంది పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతగానో దోహద పడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్.సుప్రియ, రవికుమార్, సునీత, రచనశ్రీ, ముషీరాబాద్ తహసీల్దార్ జానకి, టీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శేఖర్, ఆర్.మోజస్, రవీందర్, ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రఘురామను అనర్హుడిగా ప్రకటించాలి: ఎంపీ మార్గాని భరత్

న్యూఢిల్లీ, జూన్ 11:నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుపై గుర్రుగా ఉన్న వైసీపీ ఆయనపై అనర్హత వేటు వేయించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వైసీపీ ఎంపీ, లోక్ సభలో పార్టీ చీఫ్ విప్ మార్గాని భరత్ ఇవాళ ఢిల్లీలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి రఘురామకృష్ణరాజు అంశాన్ని చర్చించారు. రఘురామకృష్ణంరాజు పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనపై అనర్హత వేటు వేయాలని భరత్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం 10వ షెడ్యూల్ అనుసరించి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఆయన ఉల్లంఘించారని ఆరోపించారు.

రఘురామ వైసీపీ గుర్తుపై నరసాపురం లోక్ సభ స్థానం నుంచి గెలుపొందారని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. రఘురామ వ్యాఖ్యలకు సంబంధించిన ఆధారాలను తాము గతంలోనే లోక్ సభలో అందించామని భరత్ స్పీకర్ కు వివరించారు.

అనాథ పిల్లలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కిశోర్ కుమార్

సూర్యాపేట, జూన్ 11: తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలకు తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్ కుమార్ చేయూతనందించారు. నాగారం మండలం ఫణిగిరి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు ఆలకుంట్ల రమేష్-స్వరూప దంపతులు ఇటీవల మృతి చెందారు. తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు శ్వేత (19) (మానసిక వికలాంగురాలు), శిరీష (17), సంతోష్ (15) సంవత్సరాల ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరు వారం రోజుల వ్యవధిలో కరోనా కాటుకు బలి కావడంతో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్ వెంటనే స్పందించి కుటుంబ సభ్యులకు రూ.50,000 ఆర్థికసాయం అందజేసి, ఆకుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అలాగే పిల్లల చదువుల కోసం గురుకులాల్లో చేర్పిస్తానని చెప్పారు. ప్రస్తుతం ముగ్గురు చిన్నారుల బాగోగులు వాళ్ల నానమ్మ, పెదనాన్న చూసుకొంటున్నారు. పిల్లలకు నావంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రైతు వేదికలను ప్రారంభించిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్

సూర్యాపేట, జూన్ 11: తుంగతుర్తి నియోజకవర్గంలోని పలు మండలాల్లో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఇటీవల నిర్మించిన రైతు వేదికలను ప్రారంభించారు. నాగారం మండలం ఫణిగిరి, వర్ధమానుకోట గ్రామాల్లో, శాలిగౌరారం మండలం మాధారం గ్రామాల్లో రూ. 22 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన రైతు వేదికలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతు వేదికలను ఉపయోగించుకుని లాభసాటి వ్యవసాయం చేపట్టాలన్నారు. ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.

వ్యవసాయ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ తగిన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో జిల్లా రైతు బంధు సమితి కోఆర్డినేటర్ ఎస్ఏ రజాక్, డీఏవో రామారావు, జడ్పీటీసీ ఎర్ర రణిలా, ఎంపీపీలు కూరం మణి, గంట లక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, మండల పార్టీ అధ్యక్షుడు కలెట్లపల్లి ఉప్పలయ్య, పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, మార్కెట్ చైర్మన్ కట్ట లక్ష్మి వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ కందుల అనిత, రైతు బంధు సమితి కోఆర్డినేటర్ గుండా శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు ఐతగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అచ్చేదిన్ రాలేదు.. సచ్చేదిన్ వచ్చింది: రేవంత్

హైదరాబాద్ , జూన్ 11:రోజురోజుకీ పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త ఆందోళన చేపట్టింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు పెట్రోల్ బంకుల వద్ద నిరసనలు తెలుపుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తున్నారు. ఘట్‌కేసర్‌లో ఎంపీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నిరసన తెలుపుతోంది. హైదరాబాద్-వరంగల్ రహదారి పక్కన ఉన్న పెట్రోలు బంకు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రో ధరలు పెంచుతూ ఆదాయ వనరుగా మార్చుకున్నాయని ఎంపీ రేవంత్ రెడ్డి ఆరోపించారు. నిత్యం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ నిరుపేద ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. పెట్రో రేట్లు పెంచుతూ పేదలను నిలువు దోపిడి చేస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సంక్షోభంతో ఏడాది నుంచి లక్షలాది మంది ఉపాధి కోల్పోయారన్న రేవంత్.. 10 నెలల కాలంలో పెట్రోల్‌పై రూ.25, డీజిల్‌పై రూ. 26 పెంచారని చెప్పారు. కరోనా సంక్షోభంలో పేదలను ఆదుకోవాల్సింది పోయి దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో మోడీ, గల్లీలో కేడీ ఇద్దరు కలిసి లీటర్ 35 రూపాయలకు రావాల్సిన పెట్రోల్ వంద రూపాయలకు అమ్ముతున్నారని విమర్శించారు. ఇందులో రూ.33 మోడీ, రూ.32 కేసీఆర్ పన్నుల పేరిట వసూలు చేస్తున్నారని రేవంత్ అన్నారు. పెట్రోల్,డీజిల్ ధర పెరిగితే ఆ ప్రభావం రవాణా రంగంపై ఉంటుందన్నారు. మోడీ ఏడేళ్ల పాలనలో అచ్చేదిన్ రాలేదు? సచ్చేదిన్ వచ్చిందన్నారు. పెట్రో ధరలు పెరగడంతో నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని ఎంపీ రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఢిల్లీలో బిజీబిజీగా ఏపీ సీఎం.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై చర్చ!

అమరావతి, జూన్ 11:రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బిజీబిజీగా గడుపుతున్నారు. వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అవుతూ ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరుపుతున్నారు. రెండోరోజు పర్యటనలో భాగంగా కేంద్ర ఉక్కు, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో ఇవాళ జగన్ భేటీ అయ్యారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంతో పాటు కాకినాడ పెట్రో కాంప్లెక్స్, పెట్రో వర్సిటీ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్‌తోనూ ఆయన సమావేశం కానున్నారు. రైల్వేకు సంబంధించిన పలు అంశాలను ఆయనతో చర్చిస్తారు.

ఇక, నిన్న కేంద్రమంత్రులు అమిత్‌షా, గజేంద్రసింగ్ షెకావత్, ప్రకాశ్ జవదేకర్ తో సీఎం జగన్ సమావేశం అయ్యారు. పోలవరం సహా ఏపీకి సంబంధించిన అనేక అంశాలపై వారితో చర్చించారు. కాగా, సీఎం తన పర్యటన ముగించుకుని ఈ రోజు మధ్యాహ్నం తాడేపల్లిలోని తన అధికారిక నివాసానికి చేరుకునే అవకాశం ఉంది.

4500 కోట్ల రూపాయల సౌర పీఎల్ఐ పథకానికి బిడ్లు ఆహ్వానించిన ఇరెడా

హైదరాబాద్ , జూన్ 11:'కేంద్ర నూతన, పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ' (ఎంఎన్ఆర్ఈ) ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్' (ఇరెడా), సౌర విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేయడానికి సౌర మాడ్యూళ్ల తయారీదారుల నుంచి బిడ్లను ఆహ్వానించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 4,500 కోట్ల రూపాయల ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద ఈ బిడ్లను పిలిచింది. ఈ పథకం అమలు సంస్థగా ఇరెడాను ఎంఎన్ఆర్ఈ నియమించింది. సోలార్ ఫోటో వోల్టాయిక్ (పీవీ) మాడ్యూళ్ల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు 4500 కోట్ల రూపాయల పథకానికి కేంద్ర మంత్రివర్గం గతంలోనే ఆమోదముద్ర వేసింది.

ఈ పథకానికి దరఖాస్తు చేయడానికి ఈ నెల 30 ఆఖరు తేదీ. అన్ని అర్హతలున్న బిడ్డర్లను జులై 30 కల్లా ఎంపిక చేస్తారు. గత నెల 25న, ఇరెడా తన వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియ అదే నెల 31 నుంచి ప్రారంభమైంది.

ఈ పథకం కింద కేటాయించిన మొత్తం ఉత్పత్తి సామర్థ్యం కోసం బ్రౌన్‌ఫీల్డ్ లేదా గ్రీన్‌ఫీల్డ్ సదుపాయాన్ని దరఖాస్తుదారులు సిద్ధం చేసుకుని ఉండాలి. బ్రౌన్, గ్రీన్‌ఫీల్డ్‌ను కలిపి చూపడానికి వీల్లేదు. ఉత్పత్తి సామర్థ్యం కోసం అవసమైన సామగ్రిని బిడ్ చివరి తేదీ కంటే ముందే దిగుమతి చేసుకుంటే, ఈ పథకం కింద అనర్హులుగా గుర్తిస్తారు. కనీసం వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేయాలి. అన్ని అర్హతలున్న సంస్థలకు ఏటా, ఐదేళ్లపాటు పీఎల్ఐ అందిస్తారు.

ప్రస్తుతం, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న సౌర బ్యాటరీలు, మాడ్యూళ్లపైనే సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రధానంగా ఆధారపడి ఉంది. దేశీయంగా వీటి ఉత్పత్తి అతి తక్కువగా ఉంది. విద్యుత్ రంగం వంటి వ్యూహాత్మక రంగం కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడడాన్ని 'అధిక సామర్థ్య సౌర పీవీ మాడ్యూళ్ల జాతీయ కార్యక్రమం' తగ్గిస్తుంది. 'ఆత్మనిర్భర్ భారత్‌ను' బలోపేతం చేస్తుంది.

మరింత చేరువగా 'కొవిడ్' సేవలు

-నగరంలో బస్సును ప్రారంభించిన మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం, జూన్ 11: ప్రజలకు కొవిడ్ వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు మొబైల్ ఐసీయూ బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. కొవిడ్ బాధితులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పటిష్ట చర్యలతోపాటు వీరాస్మార్ట్ హెల్త్‌కేర్ సహకారంతో ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ మొబైల్ మెడికల్ యూనిట్ బస్సులను అన్ని జిల్లాలకు కేటాయించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాకు వచ్చిన మొబైల్ ఐసీయూ బస్సును రోటరీనగర్‌లో కలెక్టర్ కర్ణన్‌తో కలిసి మంత్రి అజయ్ గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రెండు మొబైల్ మెడికల్ యూనిట్ బస్సులను అందించిన లార్డ్స్ చర్చి బాధ్యులు, వైద్య సేవలను అందిస్తున్న వీరా హెల్త్‌కేర్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బస్సులో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను మంత్రి పరిశీలించారు. తొలి విడతగా రాష్ట్రంలో 30 ఐసీయూ మెడికల్ యూనిట్ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు లార్డ్స్ చర్చి ప్రతినిధులు అబ్రహాం, రమేశ్‌లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బస్సులో వైద్యసేవలతోపాటు ల్యాబ్, డాక్టర్, నర్సింగ్ స్టాఫ్, ఆక్సిజన్‌తో కూడిన పది బెడ్లు ఏసీ సౌకర్యంతో అందుబాటులో ఉంటాయని వివరించారు. మేయర్ నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, పాస్టర్ సత్యపాల్ సందీప్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, చిరుమామిళ్ల లక్ష్మి, షేక్ జాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక టీకా కేంద్రాలు

కొవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కనీస సదుపాయాలు సమకూర్చాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరంలోని శాంతినగర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సూపర్ స్ప్రెడర్ల వ్యాక్సినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి మంత్రి గురువారం సందర్శించి వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సూపర్ స్ప్రెడర్లందరికీ వ్యాక్సినేషన్ ఇవ్వాలని, వ్యాక్సిన్ కేంద్రాల వద్ద నీడ, తాగునీటి సౌకర్యం, కూర్చునే సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యాక్సినేషన్ అనంతరం తప్పనిసరిగా 30 నిమిషాలు అబ్జర్వేషన్‌లో ఉంచాలని, అందుకోసం ప్రతి కేంద్రంలో వెయిటింగ్ రూం, అబ్జర్వేషన్ రూం తప్పనిసరిగా ఉంచాలని మంత్రి సూచించారు. వ్యాక్సిన్ కేంద్రాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. కేఎంసీ మేయర్ నీరజ, కమిషనర్ అనురాగ్ జయంతి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, కార్పొరేటర్లు కే.మురళి, మక్బుల్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు

కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్ జూన్ 11(నేటినిజం ప్రతినిధి): సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈనెల 24వరకు పొడిగించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో, రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుడటం అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించింది. మద్యం ప్రియుల ఆగడాలకు కళ్ళెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. ఐపిసి 188, హైదరా బాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధన లనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో డిజె సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈనెల 24వరకు పొడగించడం జరిగిందని పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డిజె సౌండ్‌ల వినియోగంపై నిషేధాజ్ఞలు విధించడం జరిగిందని పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి కొవిడ్ టీకా డ్రైవ్

హైదరాబాద్ , జూన్ 11: ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి అదేవిధంగా హ్యూమన్ ట్రాఫికింగ్ నుండి రక్షించబడిన వ్యక్తుల కోసం ప్రజ్వల సహకారంతో మెడికోవర్ హాస్పిటల్స్ శుక్రవారం ఉచిత కొవిడ్ టీకా డ్రైవ్‌ను నిర్వహించింది. సామాజిక సేవలో భాగంగా ఎల్‌జీబీటీకి చెందిన 200 మంది అదేవిధంగా ప్రజ్వల చేత రక్షించబడిన వ్యక్తులకు మెడికోవర్ హాస్పిటల్స్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

కొవిడ్ నిబంధనలు పాటిస్తూ వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపట్టినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. భవిష్యత్తులో ఇలాంటి డ్రైవ్‌లను నిర్వహించడానికి ప్రజలను ప్రేరేపించడం కూడా దీని లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరికీ కొవిడ్ టీకా అన్న పిలుపులో భాగంగా సమాజంలో ఎక్కువగా విస్మరించే వర్గాల వారికి తాము టీకా అందించాలని భావించినట్లు మెడికోవర్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు.

ప్రజ్వల వ్యవస్థాపకురాలు సునీతా కృష్ణన్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ వివక్ష, పక్షపాతం కారణంగా సమాజంలో అట్టడుగున ఉందన్నారు. ఇది వారి ఆరోగ్య వ్యవస్థను సవాల్ చేస్తుందన్నారు. సోషల్ మీడియా ద్వారా వ్యాపించిన తప్పుడు సమాచారంతో ట్రాన్స్‌జెండర్స్ అంటే సమాజంలో అనవసరమైన భయాలను సృష్టించిందన్నారు. ఈ డ్రైవ్ మరింత మంది ట్రాన్స్‌జెండర్స్ వ్యక్తులు ముందుకు వచ్చి కొవిడ్ టీకాలు తీసుకునేందుకు ప్రేరేపిస్తుందన్నారు.

శ్రీవారి సేవలో సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, జూన్ 11:: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనంలో సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు ఆలయ మహాద్వారం వద్ద అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపం వద్ద వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు. ఆలయ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అటునుంచి జస్టిస్ ఎన్వీ రమణ తిరుచానూరు వెళ్లనున్నారు. పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. నిన్న రాత్రి శ్రీవారి ఏకాంత సేవలో పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు

జస్టిస్ ఎన్వీ రమణ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌కు రానున్నారు. ఇవాళ మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయం వద్ద సీజేఐకి ఘనస్వాగతం పలికేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విమానాశ్రయంలో హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ అధికారులు జస్టిస్ ఎన్వీ రమణకు స్వాగతం పలకున్నారు. శంషాబాద్ నుంచి నేరుగా తన ఇంటికి చేరుకుంటారు.

ఉస్మానియాలో బాలికకు అరుదైన శస్త్ర చికిత్స.. 2 కేజీల హెయిర్ బాల్ తొలగింపు

హైదరాబాద్ , జూన్ 11: రాపన్‌జెల్ సిండ్రోమ్ అని పిలువబడే చాలా అరుదైన వ్యాధితో బాధపడుతున్న 17 ఏళ్ల బాలిక ప్రాణాలను ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓఉఊ) లోని సర్జన్లు కాపాడారు. రాపన్‌జెల్ సిండ్రోమ్ కలిగిన వారి జీవితం సాధారణంగా విషాదంగానే ముగుస్తుంది. కానీ ఈ విషయంలో వైద్యుల తీవ్ర శ్రమ ఫలించి బాలిక బ్రతికి బట్టకట్టింది.

శంషాబాద్, గగన్‌పహాడ్‌కు చెందిన పూజిత మందాల అనే బాలికకు జుట్టును నమలడం, మింగడం అలవాటు. ఈ కారణంగా జుట్టంతా చేరి బాలిక కడుపులో బంతి ఆకారంలో చుట్టుకుంది. బాలిక ఇటీవలే కొవిడ్-19 నుండి కోలుకుంది. గత మూడు నెలలుగా పొత్తికడుపులో నొప్పి కారణంగా చూపించుకునేందుకు ఉస్మానియా దవాఖానకు వచ్చింది. పరీక్షించిన వైద్యులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. బాలికకు గత ఆరు నెలలుగా జుట్టును నమిలి, మింగే అలవాటు ఉందన్నారు.

జూన్ 2న శస్త్ర చికిత్స చేసి 150 సెంటీమీటర్ల పొడవైన 2 కేజీల బరువున్న జుట్టు బంతిని తొలగించారు. తమ రికార్డుల్లో అప్పటివరకు ఇలాంటి కేసులు 68 నమోదు అయ్యాయని కాగా ఇది చాలా అరుదైన కేసు అని వైద్యులు తెలిపారు. రాపన్‌జెల్ సిండ్రోమ్ లక్షణం కడుపు ఉబ్బరం, బరువు తగ్గడం, వాంతులు, కడుపునొప్పి, నెత్తిమీద జుట్టు రాలడం వంటివని శస్త్రచికిత్సకు నాయకత్వం వహించిన ఓజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్ తెలిపారు.

చౌడాపూర్ నూతన మండలాన్ని ప్రారంభించిన మంత్రి సబిత

వికారాబాద్, జూన్ 11: జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో ఏర్పాటు అయిన నూతన చౌడాపూర్ మండలాన్ని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండల వనరుల కేంద్రం, అంగన్ వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ భవనం, వ్యవసాయ శాఖ కార్యాలయ భవనాలను ప్రారంభించి చౌడా పూర్ మండల ప్రజలకు అంకితం చేశారు. చౌడాపూర్ ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మండల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి మంత్రి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ పౌసుమి బసు, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణా రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ ధరలపై భగ్గుమన్న కాంగ్రెస్

వేములవాడలో నిరసన...

రాజన్న సిరిసిల్ల, జూన్ 11(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో పెట్రోల్ పంప్ ఆవరణలో వేములవాడ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ఆధ్వర్యంలో పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి,కాంగ్రెస్ జిల్లా నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ , సంగ స్వామియాదవ్,మెడికె చంద్రశేఖం ,నాగుల విష్ణుమాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోవాలని, పెరిగిన ధరలతో ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు .కరోనా సమయంలో సామాన్యుని వైద్యానికి నోచుకోని ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసే విధంగా ఉన్నాయని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి చర్యలనుమాను కోవాలన్నారు .వంట గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో నిత్యావసరాల ధరలు కూడా పెరిగాయని సామాన్యుడి నడ్డి విరిచేందుకు ప్రభుత్వాలు పనిచేస్తున్నట్లు భావిస్తున్నామన్నారు. దేశమంతా కరోనా మహమ్మారితో వైద్యానికి డబ్బులు లేవని కనీసం ఇప్పుడు కడుపునిండా తిందామన ుకున్నా చమురు ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగి కొనలేని పరిస్థితులు సామాన్యులకు ఎదురైందన్నారు. ఇకనైనా ప్రభుత్వం గుర్తించి పెరిగిన చమురు ధరలు తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిలుక రమేష్ కనికరపు రాకేష్ చిలువేరి శ్రీనివాస్ , లింగంపల్లి కిరణ్ దడి మల్లేశం ములే కిషోర్ రామ్ గోపాల్ రావు వస్తాది కృష్ణ కూర దేవయ్య అరుణ్ తేజ చారి ప్రకాష్ నక్క సాయి కోయల్ కార్ మస్తాన్ అనపర్తి శంకర్, మర్రిపల్లి రాజు తదితరులు ఉన్నారు

దేశంలో భారీ స్థాయిలో పెరిగిన బ్లాక్ ఫంగస్ కేసులు

న్యూఢిల్లీ, జూన్ 11:దేశంలో బ్లాక్ ఫంగస్ కేసులు రోజురోజుకు మరింతగా పెరిగిపోతున్నాయి. గత మూడు వారాల్లో ఇవి ఏకంగా 150 శాతం పెరిగి 31,216కు చేరుకున్నాయి. అలాగే దీని బారినపడి ఇప్పటి వరకు 2,109 మంది ప్రాణాలు కోల్పోయారు. కరోనా సెకండ్ వేవ్‌తో పోరాడుతున్న భారత వైద్య రంగంపై బ్లాక్ ఫంగస్ కేసులు మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. కేసులు పెరుగుతుం డడంతో దీని చికిత్సకు ఉపయోగించే యాంఫోటెరిసిన్-బి డ్రగ్‌కు విపరీతమైన కొరత ఏర్పడింది.

మహారాష్ట్రలో 7,057 బ్లాక్ ఫంగస్ కేసులు వెలుగు చూడగా, 609 మంది మరణించారు. ఆ తర్వాతి స్థానంలో గుజరాత్ ఉంది. ఇక్కడ 5,418 మంది ఈ బ్లాక్ ఫంగస్ బాధితులుగా మారగా, 323 మంది మృతి చెందారు. బ్లాక్ ఫంగస్ కేసుల్లో రాజస్థాన్‌ది మూడోస్థానం. ఇక్కడ 2,976 కేసులు నమోదు అయ్యాయి. అయితే, కరోనా మరణాల్లో మాత్రం కర్ణాటక మూడో స్థానంలో నిలిచింది. ఈ రాష్ట్రంలో ఇప్పటి వరకు 188 మంది బ్లాక్ ఫంగస్‌తో మృతి చెందారు. మహారాష్ట్రలో మే 25న ఒక రోజు 2,770 బ్లాక్ ఫంగస్ కేసులు నమోదు కాగా, గుజరాత్‌లో 2,859 కేసులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ఝార్ఖండ్‌లోనూ కేసులు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం అతి తక్కువగా 23 మంది బ్లాక్ ఫంగస్‌తో మృతి చెందారు.

కరోనా కోరల్లో విలవిల్లాడిన ప్రపంచ నగరాల జీవన ప్రమాణాలు

(ఈఐయు 'గ్లోబల్ లివబులిటీ ఇండెక్స్-2021' తాజా నివేదిక ఆధారంగా)

కరోనా మహావిపత్తు మిగిల్చిన విషాదం నేపథ్యంలో ప్రపంచ మహానగరాల్లో జీవన ప్రమాణాలు తీవ్రంగా పతనమైనాయని మనందరికీ తెలుసు. ఈఐయు (ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యునిట్) విడుదల చేసిన 'ప్రపంచ జీవన ప్రమాణ సూచిక-2021 (గ్లోబల్ లివబులిటీ ఇండెక్స్-2021' తాజా నివేదికలో పలు ఆసక్తికర విషయాలు బయట పడ్డాయి. కరోనాను సమర్థవంతంగా కట్టడి చేసిన దేశాలకు చెందిన మహానగరాల్లో అత్యుత్తమ జీవన ప్రమాణాలు కనబడ్డాయని, యూరొప్/యుయస్ దేశాల మహానగరాల్లో కరోనా కల్లోలంతో జీవన ప్రమాణాలు పడిపోయాయని వివరించబడింది. ఆసియా మహానగరాల్లో అత్యుత్తమ మరియు కనిష్ట జీవన ప్రమాణాలు కలిగిన నగరాలు కూడా ఉండడం గమనించబడింది. ప్రపంచవ్యాప్తంగా 140 నగరాల జీవన ప్రమాణాల సూచిక జాబితా రూపొందించడంలో స్థిరత్వం (25 శాతం), వైద్య ఆరోగ్య వసతులు (20 శాతం), పర్యావరణం/సాంస్కృతికం (25 శాతం), విద్య (10 శాతం), మౌళిక వసతులు (20 శాతం) అనబడే 5 అంశాలను మరియు 30 గుణాత్మక, పరిమాణాత్మక కారకాలను ప్రాతిపదికలుగా తీసుకోవడం జరిగింది. ఉత్తర అమెరికా దేశ నగరాల్లో సగటు జీవన ప్రమాణ సూచిక 83.4, పశ్చిమ యూరప్‌లో 83.6, తూర్పు యూరప్‌లో 64.3, ఆసియాలో 68.6, లాటిన్ అమెరికాలో 60.8, ఉత్తర ఆఫ్రికా-మిడిల్ ఈస్ట్‌లో 53.4 మరియు సబ్-సహార ఆఫ్రికాలో 46.6 జీవన సూచికలు రికార్డు అయ్యాయని నివేదిక తెలిపింది.

అత్యుత్తమ జీవన ప్రమాణాలు కలిగిన 10 ప్రపంచ మహానగరాలు:

అత్యుత్తమ జీవన ప్రమాణాలు కలిగిన ప్రపంచ మహానగరాల్లో ఆక్లాండ్ (న్యూజిలాండ్) ప్రథమ స్థానంలో నిలిచింది. తరువాత స్థానాల్లో ఓసాక (జపాన్), అడలైడ్ (ఆస్ట్రేలియా), వెల్లింగ్టన్ (న్యూజిలాండ్), టోక్యో (జపాన్), పెర్త్ (ఆస్ట్రేలియా), జూరిచ్ (స్విట్జర్‌లాండ్), జెనీవా (స్విట్జర్‌లాండ్), మెల్బర్న్ (ఆస్ట్రేలియా) మరియు బ్రిస్బెన్ (ఆస్ట్రేలియా) నగరాలు తొలి 10 స్థానాల్లో నిలిచాయి. జీవన ప్రమాణాల సూచికలోని తొలి 10 నగరాల్లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియాకు చెందిన 6 నగరాలు, జపాన్‌కు చెందిన 2 నగరాలు, స్విస్‌కు చెందిన 2 నగరాలు ఉండడం విశేషం. ఈ దేశాలు కరోనాను పటిష్ట ప్రణాళికలతో కట్టడి చేయడంలో సఫలత సాధించడంతో కరోనా పూర్వపు జీవన ప్రమాణాల్లో మార్పులు ఏమీ కనిపించలేదు. ఇండియాలో బెంగుళూరు, పూనే, అహ్మదాబాద్, చెన్నై, సూరత్, ముంబాయ్, కోయంబత్తూర్, వడోదర, ఇండోర్, గ్రేటర్ ముంబాయ్ నగరాలు మెరుగైన జీవన ప్రమాణాలు గల మహానగరాలుగా గుర్తించబడ్డాయి.

అత్యల్ప జీవన ప్రమాణాలు కలిగిన 10 ప్రపంచ మహానగరాలు:

అతి తక్కువ జీవన ప్రమాణాలు కలిగిన నగరాల్లో డమాస్కస్ (సిరియా), లాగోస్ (నైజీరియన), పోర్ట్ మోర్స్‌బీ (న్యూ గ్వీనియా), ఢాకా (బంగ్లాదేశ్), అల్జీర్స్ (అల్జీరియ), ట్రిపోలి (లిబియా), కరాచీ (పాకిస్థాన్), హరారేల (జింబాబ్వే), డైలా (కెమరూన్), కరాకస్ (వెనేజులా) మహానగరాలు సూచిక జాబితాలో అట్టడుగున ఉన్నాయి.

ప్రపంచ జీవన ప్రమాణాల సూచిక తయారీలో ఫిబ్రవరి-2020 నుంచి మార్చి-2021 కాలవ్యవధిని తీసుకోవడం జరిగింది. కరోనా కన్న ముందు జీవన ప్రమాణాలతో పోల్చితే ప్రపంచవ్యాప్తంగా నేడు 7 పాయింట్ల పతనం కనబడిందని తెలుస్తున్నది. యూరప్ నగరాలు కరోనా విజృంభణలతో చితికి పోవడం, విద్యాలయాలు/హోటళ్లు మూసి వేయడం, సాంస్కృతిక/క్రీడా స్థబ్దత లాంటి కారణాలతో నగరాల జీవన ప్రమాణాలు పడిపోయాయని వివరించారు. భారతదేశ మహానగరాల్లో జీవన ప్రమాణాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయని, కరోనా తొలి/మలి అల దుష్ప్రభావం కారణంగా వైద్య ఆరోగ్య వనరులు కొరవడి ప్రజా జీవన ప్రమాణాలను దెబ్బతీశాయని తెలుస్తున్నది. కోవిడ్-19 మహమ్మారి ప్రళయంతో ప్రజాజీవనం అతలాకుతలం అయ్యింది. కరోనా అలల ప్రభావం పట్టణాలపై అధికంగా పడింది. రెండవ వేవ్ సునామీ తాకిడికి పట్టణాలు, పల్లెలు గజగజ వణికాయి. మన మహానగరాలు లాక్‌డౌన్ నిబంధనలతో చిన్నబోయాయి. వలసలు బారులు తీరాయి. ఉద్యోగ ఉపాధులు సన్నగిల్లాయి. బతుకుదెరువు ఎండమావైంది. రెండవ అల తగ్గుముఖం పడుతున్న వేళ 3వ అలను సమర్థవంతంగా నిలువరించి, కరోనా పూర్వపు జీవన ప్రమాణాలను అందుకోవడానికి ప్రతి ఒక్కరు తమ చేయూతను ఇవ్వాడానికి ముందుకు రావాలని కోరుకుందాం. - డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి 99497 00037

పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని

కోనరావుపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

రాజన్న సిరిసిల్ల, జూన్ 11(నేటినిజం ప్రతినిధి): పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ ఇచ్చిన పిలుపు మేరకు కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెట్రోల్ బంకుల వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ టి పిసిసి కార్యదర్శి ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ కరోన మహమ్మారితో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా కూడా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు రోజు రోజుకు అడ్డగోలుగా పెరుగుతున్నాయని అన్నారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.100 మార్కును దాటిందని, ఈ పెరుగుదల వల్ల అన్ని గృహవసరాలు మరియు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. గత 13 నెలల్లో, పెట్రోల్ పై లీటర్ కు రూ.25.72 డీజిల్ పై లీటరుకు 23.93 పెరిగాయని, ఈ ఐదు నెలల్లో 43 సార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా దోపిడీకి ఇది ఒక ఉదాహరణ అని ఆయన అన్నారు. ఈ బహిరంగ దోపిడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెట్రోల్ పంపుల ముందు నిరసన తెలుపుతున్నామన్నారు. ఈ పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల ఆర్థిక మందగమనం, విపరీతమైన నిరుద్యోగం, వేతనాలలో కోత, ఉద్యోగ నష్టాలు మరియు అధిక ధరల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, ఈ ప్రజా వ్యతిరేక అంశాలపై మనం నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కె సి రెడ్డి జగన్మోహన్ రెడ్డి ఉపాధ్యక్షులు చేకూరి గంగాధర్ జిల్లా కార్యదర్శి చంద్రగిరి గోపాల్ కచ్చకాయ ఎల్లయ్య గొట్టే రుక్మిని మండల నాయకులు ఎల్లయ్య యాదవ్ మస్కూరి కాశీ రాం ప్రదీప్ గ్రామ అధ్యక్షులు మంద లింబయ్య ఎక్కల దేవి శ్రీనివాస్ తిక్కల సునీల్ హరీష్ పునీత్ అగేష్ మంగిలి శంకర్ నిత్యానందం తదితరులు పాల్గొన్నారు

మెడికల్ కళాశాలకు వడివడిగా అడుగులు

మహబూబాబాద్, జూన్11 : మహబూబాబాద్ జిల్లాలో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదముద్రపడడంతో పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే అధికారులు స్థలాన్ని గుర్తించి, ఖరారు చేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయం వెనుకాల 551 సర్వేనంబర్‌లోని 30 ఎకరాల భూమిలో రెండు కళాశాలలు నిర్మించాలని నిర్ణయించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాల నుంచి ఆరు కిలోమీటర్లలోపు మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఉండాలన్న నిబంధన మేరకు అధికారులు మూడు కిలోమీటర్లలోపే స్థలాన్ని గుర్తించి, ఖరారు చేశారు. మొదట మల్యాల సమీపంలో, కొత్త కలెక్టరేట్ భవనం వెనుకాల అనంతారం, గాంధీనగర్, జమాండ్లపల్లి-మున్నేరువాగు మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన అధికారులు చివరకు జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఎస్పీ కార్యాలయం వెనుకాల ఉన్న స్థలాన్ని ఓకే చేశారు. ఈ స్థలానికి సమీపం నుంచే ఎన్‌హెచ్-30 వెళ్తుండడం కలిసివస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

దీనికి ఒకవైపు ఎస్పీ కార్యాలయం, మరో వైపు కేంద్రీయ విద్యాలయం, మరో వైపు జాతీయ రహదారి వెళ్తుండడంతో అన్ని విధాలా సౌకర్యంగా ఉంటుందని జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు అంటున్నారు. కాగా, ఆ స్థలాన్ని గురువారం మంత్రి సత్యవతిరాథోడ్, జడ్పీచైర్‌పర్సన్ బిందు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోన్‌రెడ్డి, అదనపు సంయుక్త కలెక్టర్ కొమురయ్య, తహసీల్దార్ రంజిత్‌కుమార్ పరిశీలించారు.

స్థలం ఖరారవడంతో శంకుస్థాపనకు అధికారులు చకచకా ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో స్థలాన్ని చదును చేసే పనులు ప్రారంభించనున్నారు.ఎస్పీ కార్యాలయం వెనుకాల నిర్మించనున్న మెడికల్, నర్సింగ్ కళాశాలల నిర్మాణానికి త్వరలో సీఎం కేసీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన జరుగనుంది. కురవి రోడ్‌లో సలార్‌తండా వద్ద నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించడంతోపాటు మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నెల చివరి వారం లేదా వచ్చే నెల మొదటి వారంలో సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన ఉండే అవకాశం ఉందని జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు భావిస్తున్నారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

3 కోట్ల మెట్రిక్ టన్నులతో దేశంలోనే టాప్‌లో తెలంగాణ

-కోరుట్లలో వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశం

కోరుట్ల, జూన్ 10: ఒకప్పుడు పంజాబ్ రాష్ట్రంలో అత్యధికంగా 2.2కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించే వారని, ప్రస్తుతం తెలంగాణ 3 కోట్ల మె ట్రిక్ టన్నుల దిగుబడితో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, సంజయ్‌కుమార్, కలెక్టర్ రవి గుగులోత్‌తో కలిసి వ్యవసాయ విధానం, అనుసరించాల్సిన పద్ధతులు, ఇతర అంశాలపై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో భవిష్యత్ తరాలకు ఉపా ధి కల్పించేలా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. రైతులు ఒకే రకమైన సాగు విధానానికి మొగ్గు చూపకుండా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. పంటల సాగు ద్వారా రైతులు గడించిన అనుభవం, పరిజ్ఞానాన్ని పరిగణలోకి తీసుకొని వ్యవసాయరంగంలో నూతన ఒరవడి, మార్పులకు శ్రీకారం చుట్టాలన్నారు. రైతులు వరిలో సన్నాలు పండించే దిశగా ప్రోత్సహించాలని, మార్కెట్‌లో అధిక డిమాండ్ కలిగిన పంటలను సాగు చేసేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తం గా సూనె గింజల ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉందని, రైతులు మూస పద్ధతిలో కాకుండా తక్కువ నీరు, విద్యుత్ వినియోగం తక్కువగా ఉండే లాభసాటి కందులు, మక్క పత్తి సాగుకు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలని సూచించారు.

ఎంతటి కష్టమైనా రైతులకు ఇబ్బందులు ఉండవద్దనే ఉద్దేశంతో వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం కల్పిస్తూ ధాన్యం కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఆయిల్ ఫామ్ సాగు కోసం సాంకేతిక శాస్త్రవేత్తలు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పర్యటించి జగిత్యాల జిల్లా సాగుకు అనుకూలమని నివేదిక ఇచ్చారని తెలిపారు. 2022 నాటికి జిల్లాలో ఆయిల్ ఫామ్ అధికంగా సాగు చేసేలా చూడాలని అధికారులకు మంత్రి సూచించారు. రైతు వేదికల ద్వారా కాలనుగుణంగా వేయాల్సిన పంటలు పొందే లాభాలు, దిగుబడిపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. ఇతర రాష్ట్రాలు సాగు విధానంలో అనుసరిస్తున్న సాంకేతిక అంశాలను అధ్యయనం చేసేందుకు అధికారుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి కల్పనకు దూర దృష్టితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. మామిడి, జామ తోటలు వేసి అందులో కోళ్లు, గొర్రెలు, మేకలు, పాడి పశువులు పెంచాలన్నారు. వాటి ద్వారా వచ్చే గుడ్లు, పాలు, మాంసం అనుబంధ ఉత్పత్తులతో లాభాలు గడించవచ్చన్నారు. చక్కెర కార్మాగారాలను రైతులు స్వాతంత్ర్యంగా నడుపుకున్నప్పుడే లాభాలు గడిస్తారని మంత్రి చెప్పారు.

మహారాష్ట్రలోని రైతులు అలాగే చేస్తున్నారని, మెట్‌పల్లి ప్రాంతంలోని చెరుకు రైతులు 30 వేలకు తగ్గకుండా సహకార సంఘంలో సభ్యులుగా చేరి కొంత మొత్తాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేసుకొని సొంతంగా ఫ్యాక్టరీ నడుపుకుంటే లాభాలు దక్కుతాయన్నారు. సహకార సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని ఆ దిశగా రైతులు ఆలోచన చేయాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. జిల్లాలో యాసంగిలో 81,888 మంది రైతుల ద్వారా 5 లక్షల 41 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రూ.1021 కోట్ల విలువైన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు రైతులకు పంటకు సంబంధించి రూ.865 కోట్లు చెల్లించినట్లు వివరించారు. కాగా సమావేశానికి హాజరైన ఏవో, ఏఈవోలు తమ ప్రాంతాల్లో సాగవుతున్న పంటల వివరాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాల ద్వారా పెరిగిన ప్రత్యామ్నాయ పంట సాగు విధానంపై మంత్రికి వివరించారు. జిల్లాలో వ్యవసాయాధికారుల పనితీరుపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ జడ్పీ అధ్యక్షురాలు దావ వసంత, ఆర్డీవో వినోద్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ అధ్యక్షుడు బాపురెడ్డి, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు. ఎంపీపీ తోట నారాయణ, ఏడీఏ రాంచందర్, డీఈ సురేష్, ఏఈ, ఏవోలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కొత్తగా 8,239 కరోనా కేసులు, 61 మరణాలు

అమరావతి, జూన్ 11: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా తీవ్రత కొనసాగుతోంది. గడచిన 24 గంటల్లో 1,01,863 శాంపిల్స్ పరీక్షించగా కొత్తగా 8,239 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కొవిడ్‌తో 61 మంది ప్రాణాలు కోల్పోయారు. 24 గంటల్లో 11,135 మంది కరోనా నుంచి పూర్తిగా కోలుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 1796122కు చేరింది. ప్రస్తుతం 96100 యాక్టివ్ కేసులున్నాయి. ఇప్పటి వరకు కరోనా నుంచి కోలుకున్న వారి సంఖ్య 1688198కు చేరింది. కరోనా మహమ్మారి బారినపడి మరణించిన వారి సంఖ్య 11824కు పెరిగింది.

15న సూర్యాపేటలో కల్నల్ సంతోష్ బాబు విగ్రహావిష్కరణ

సూర్యాపేట, జూన్ 11:: దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్ బాబు విగ్రహాన్ని ఈ నెల 15న సూర్యాపేట పట్టణంలో ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు సూర్యాపేటలోని కోర్టు చౌరస్తాలో ఏర్పాట్లను మంత్రి జగదీశ్ రెడ్డి పరిశీలించారు. తెలంగాణకు, సూర్యాపేట గడ్డకు పేరు ప్రఖ్యాతులను తీసుకొచ్చిన కల్నల్ సంతోష్ బాబు విగ్రహం ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత జూన్‌లో లఢక్‌లోని గల్వాలన్ లోయలో చైనా ఆర్మీతో జరిగిన పోరాటంలో ప్రాణాలొదిలిన సంతోష్ బాబు కుటుంబానికి.. సీఎం కేసీఆర్ కొండంత భరోసాను, ధైర్యాన్ని అందించారని చెప్పారు. వారి కుటుంబ సభ్యుల కోరిక మేరకు సూర్యపేట పట్టణంలోని కోర్ట్ చౌరస్తాకు కల్నల్ సంతోష్ బాబు చౌరస్తాగా నామకరణం చేశామని, చౌరస్తాను అందంగా సుందరీకరణ చేసినట్లు వెల్లడించారు.

సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సర్వే పనులు వాయిదా

హైదరాబాద్ , జూన్ 11:సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్ నియోజకవర్గాలకు నీరందించే సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సర్వే పనులను ఈ నెల 12వ తేదీన ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సర్వే పనులు 14 వ తేదీకి వాయిదా పడింది. మంత్రి హరీశ్ రావు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఉన్నందున శనివారం నాటి సంగమేశ్వర లిఫ్ట్ సర్వే ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది.

కాగా, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి హరీశ్ రావు కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉన్నందున పనుల ప్రారంభోత్సవ కార్యక్రామాన్ని వాయిదా వేశారు. ఈ నెల 14 తేదీన (సోమవారం) 11 గంటలకు అదే ప్రాంతంలో మంత్రి హరీశ్ రావు సర్వే పనులను ప్రారంభిస్తారని అందోల్ ఎమ్మెల్యే చంట్రి క్రాంతి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాప్-ఓ-మీటర్ & ది స్పేస్ బ్యాండిట్స్ టీవీ ప్రీమియర్‌తో అద్భుత అంతరిక్ష ప్రయాణానికి అత్యంత ఉత్సాహంతో సిద్ధంగా ఉండండి

హైదరాబాద్ , జూన్ 11:సానీనిఎ జంజ! ప్రముఖ పిల్లల వినోద ఛానెల్, పాప్-ఓ-మీటర్ అనే దెయ్యం కామెడీకి నిలయం, ఈ ప్రోగ్రాంతో వారి యువ ప్రేక్షకులు దెయ్యాలను చూసే విధానాన్ని మార్చారు. ప్రోగ్రాం యొక్క మనోహరమైన త్రయం, భూత్ బాస్ మరియు అతని ఇద్దరు సహాయకులు తకేలా మరియు పకేలా ప్రతి ఎపిసోడ్లో వారి పాప్-బస్టింగ్ ప్రయత్నాల ద్వారా పిల్లల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఇప్పుడు, సానీనిఎ జంజ! జూన్ 14 న సాయంత్రం 4 గంటలకు పాప్-ఓ-మీటర్ ఉ ది స్పేస్ బ్యాండిట్స్ అని పిలువబడే ఒక ప్రత్యేక చలనచిత్ర టెలిమూవీ ప్రీమియర్‌ను తీసుకురావడం ద్వారా వారి యువ అభిమానులను, మరొక భయానక సాహసంలోకి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉంది.

ఈ చిత్రంలో, భూత్ బాస్ మరియు అతని సహాయకులను, ఈ నక్షత్రమండలాల మధ్యవున్న విలన్ మరియు కెప్టెన్ బద్మాష్ అనే అపఖ్యాతి పాలైన అంతరిక్ష బందిపోటు సవాలు చేస్తారు. ఆ అని కూడా పిలువబడే ఈ విలన్ గోల్డెన్ ట్రంపెట్ - ఆనందం ద్వారా శక్తినిచ్చే ఒక ఆధ్యాత్మిక పరికరంను దొంగిలించాడు. మనుషుల నుండి ఆనందాన్ని దూరం చేసే పనిలో ఉన్న ఈ శక్తివంతమైన విరోధిని ఆపడానికి ఈ ముగ్గురూ బయలుదేరారు, తద్వారా భూమి మరియు గోల్డెన్ ప్లానెట్లను జయించటానికి తన ట్రంపెట్ ను రీఛార్జ్ చేస్తారు. వారు సమయానికి పరిష్కారం కనుగొంటారా లేదా భూమి మరియు మిగిలిన విశ్వం చీకటి మరియు విచారంతో కప్పబడి ఉంటుందా? ఇంతకు ముందెన్నడూ చూడని ప్రత్యేక అంతరిక్ష సాహసయాత్ర పాప్-ఓ-మీటర్ ఉ ది స్పేస్ బ్యాండిట్స్ లో తకేలా, పకేలా మరియు భూత్ బాస్‌లను చూడటానికి ఈ జూన్ 14, సోమవారం సాయంత్రం 4 గంటలకు సానీనిఎ జంజ! ను ట్యూన్ చేయండి. ఈ నక్షత్రమండలాల మధ్యవున్న ప్రయాణానికి పిట్ స్టాప్పు జోడించడం, సానీనిఎ జంజ! పాప్-ఓ-మీటర్ అభిమానులందరికీ జూన్ 12 న మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక వాచ్ పార్టీ ద్వారా అందరికంటే ముందుగా సినిమా చూడటానికి ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. కళా మేధావి లాలన్, సినిమా ఇతివృత్త ప్రపంచాన్ని అభిమానులతో పునఃసృష్టి చేయడానికి సినిమా నేపథ్య ఆఎజ సెషన్‌ను నిర్వహిస్తుండటంతో ఉత్సాహం రెట్టింపు అవుతుంది. కింది లింక్‌లోని ప్రత్యేకమైన జూమ్ వర్క్‌షాఎమీ సీటును బుక్ చేసుకోవడానికి ఇప్పుడే నమోదు చేయండి లేదా బ్రాండ్ యొక్క ఫేస్‌బుక్ మరియు యూట్యూబ్ ఛానెల్‌లో ప్రత్యక్షంగా వీక్షించడానికి జూన్ 12, మధ్యాహ్నం 2.30 గంటలకు మీ తేదీని బ్లాక్ చేయండి.

కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి

మహబూబాబాద్, జూన్11: జిల్లా కేంద్రంలోని కురవి రహదారిలో రూ